

లీలా..విషాదాంతం!

తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురంలో ఏనుగు లీల మృతితో విషాద ఛాయలు అలుముకున్నాయి. - 6లో



ఆ తండ్రి పరుగెత్తినా.. కాపాడలేకపోయారు!

యు.కొత్తపల్లిలో వైద్యం అందక

చిన్నారి మృతి



- మెయిన్‌లో

తీరు మారాలి

మీరున్నది కూటమి ప్రభుత్వంలో..

- అధికారులు మారకపోవడంపై ఆగ్రహం
- ఇంకా వైసీపీ ప్రభుత్వంలోనే ఉన్నామనుకుంటున్నారా?
- రైతుల నుంచి ధాన్యం సేకరణలో ఇన్ని ఇబ్బందులా?
- నియోజకవర్గాల్లో సమస్యలపై ఏకరవు
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో నాయకుల మండిపాటు



జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ విప్పర్తి వేణుగోపాలకృష్ణ,కలెక్టర్ షాన్‌మోహన్

(కాకినాడ,ఆంధ్రజ్యోతి); కాకినాడసిటీ: "ప్రభుత్వం మారినా అధికారుల తీరు మారలేదు.. ఇంకా వైసీపీ ప్రభుత్వంలోనే ఉన్నామనుకుంటున్నారు..కూటమి ప్రభుత్వంలో పని చేస్తున్నామనే సంగతి అధికారులు తెలుసుకోవాలి. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ఒక్కో రకంలా నిబంధనలు ఎలా అమలు చేస్తారు" అంటూ అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికారులపై ధ్వజమెత్తారు. కాకినాడ రూరల్ వాకలపూడిలో పారిశ్రామిక కాలుష్య బుగ్గితో ప్రజలు నరకం చూస్తున్నారు. ఒక్కరోజు ఇంట్లో లేకపోతే బుగ్గి ఇళ్లల్లో పేరుకుపోతోంది. అటు నియోజకవర్గంలో అనేక చోట్ల కాలువలు కనిపించడం లేదు..అధికారులు వెదికి పెట్టాలి అంటూ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అధికారులకు చురకలంటించారు. వెరసి అధికారుల తీరుపై అధికార పక్ష ఎమ్మెల్యే ఆగ్రహాల మధ్య కాకినాడ జిల్లా పరిషత్ సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ సర్వసభ్య సమావేశం శనివారం వాడీవేడిగా జరిగింది. సమావేశానికి మంత్రులెవరూ రాకపోవడంతో ముమ్మిడివరం టీడీపీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు విప్ హోదాలో సమావేశాన్ని జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆది నుంచే వాడివేడిగా..

వ్యవసాయం, జలవనరులు, వైద్య ఆరోగ్యం, డ్వామా, డీఆర్‌డీఏ, ఉచిత ఇసుక విధానం తదితర అంశాలపై చర్చ జరిగింది. తొలుత వ్యవసాయశాఖపై చర్చ జరగ్గా ఉమ్మడి జిల్లాలో రైతులకు రబీ సాగులో నాణ్యమైన విత్తనాలు, సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా చూడడంతో పాటు రబీకి సాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేయాలని సమావేశం నిర్ణయించింది. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ రబీలో రైతులకు ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్పిందన్నారు. కానీ అధికారులు పాత విధానంలోనే ఉండిపోయారని.. పేరు మార్పుపై క్షేత్రస్థాయిలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలన్నారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా రైతులు తమకు ఇష్టం వచ్చిన రైస్ మిల్లులకు ధాన్యం అమ్ముకునే వెసులుబాటు కల్పించాలన్నారు. కానీ అధికారులు మాత్రం రూల్స్ పేరుతో అన్నదాతలను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు.ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు చర్చించేందుకు జడ్పీ సమావేశం చక్కని వేదిక అని పేర్కొన్నారు. అటు ఎత్తిపోతల పథకం ప్రయోజనాలను ఒకసారి పర్యవేక్షించాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అధికారులకు సూచించారు.జలజీవన్ మిషన్ కింద ఎక్కడెక్కడో భూగర్భజలాలు తీసి తోడడానికి బదులు పోలవరం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేసే విషయమై అధికారులు అధ్యయనం చేయాలని కోరారు.

కాలువపై..పేకాట క్లబ్బా..

ఇరిగేషన్ కాలువను కప్పెట్టేసి మాజీ ఎమ్మెల్యే కన్నబాబు పేకాట క్లబ్ కట్టాడని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో కొన్ని ఇరిగేషన్ కాలువలు మాయమైపోయామని, అధికారులు మాత్రం కాగితాల్లో వాటిని చూపుతున్నారన్నారు. ఇవన్నీ ఎక్కడ ఉన్నాయో వెదికి చూపించాలని అధికారులకు చురకలంటించారు.రూరల్‌పరిధిలో వివిధ పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యం వల్ల ప్రజలు శ్వాసకోస సమస్యల భారినపడుతున్నారన్నారు. దీనిపై కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ చుట్టుపక్క పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యంపై ఇప్పటికే శాంపిళ్లు సేకరించి పరిశీలనకు పంపామని, నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామన్నారు.కాకినాడ రూరల్ జడ్పీటీసీ మాట్లాడుతూ వాకలపూడి ప్రాంతంలో ప్యారీషుగర్స్ నుంచి వచ్చే కాలుష్యంతో నరకం చూస్తున్నామన్నారు. తన నియోజకవర్గంలోని పీహెచ్‌సీలలో వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు.తాగు,సాగు నీరు కాలుష్యం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ మండిపడ్డారు.వ్యవసాయ, ఇరిగేషన్, డ్రైనేజీ కాలువల్లో పరిశ్రమలు, సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను వదలకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కేజీ బేసిన్ నుంచి గ్యాస్ చమురు తరలించుకుపోతున్న కంపెనీలు రాయల్టీ ఏపీకి కట్టడం లేదని, కట్టించేలా సభలో తీర్మానం చేయాలని కోరారు.

స్టడీ మెటీరియల్ ఇవ్వాలి..

జడ్పీ పరిధిలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సకాలంలో అందించాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఎఫ్ స్లిప్పులు విడుదల చేయాలన్నారు. కారుణ్య నియామకాల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఉచిత ఇసుక ప్రయోజనం చేకూర్చే విధంగా చూడాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. ఇకపై సమావేశాలు సమయానికి జరిగేలా చూడాలని ఎమ్మెల్యేలంతా కోరారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న ఏకైన శాఖ పంచాయతీరాజ్ అని జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. కీలక అంశాలపై నాయకులు చేసిన సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుని అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామన్నారు.సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా జేసీ ఎస్.చినరాముడు, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భారత్, కోనసీమ జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో కె. మాధవి, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, డిప్యూటీ ఛైర్‌పర్సన్ మేరుగు పద్మలత, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో రామ్ మోహన్, ఏవో ఎం.బుజ్జిబాబు పాల్గొన్నారు.



జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

పోలీసులకు క్రీడా పోటీలు

కాకినాడ క్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు ఓటములు ముఖ్యం కాదని, క్రీడాస్ఫూర్తితో ఆడడమే అసలైన విజయం అని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అన్నారు. జిల్లాలోని పరేడ్ గ్రౌండ్‌లో పోలీసులకు యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. కాకినాడ, పెద్దాపురం పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలోని ఆర్మ్‌డ్ రిజర్వు, హోమ్ గార్డ్ సిబ్బంది క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. మహిళలు, పురుషులకు షాట్ పుట్, డిస్కస్‌త్రో, 800 మీటర్లు, 400 మీటర్లు, 200 మీటర్లు పరుగుపందాలు, పురుషులు, మహిళల లాంగ్ జంప్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ తదితర పోటీలు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సమాజాన్ని కంటికి రెప్పలా కాపాడేది పోలీస్ వ్యవస్థ అన్నారు. ప్రారంభ వేడుకల్లో క్రీడాకారులు చేసిన మార్చ్‌ఫాస్ట్ ఎంతగానో ఆకట్టుకుంది. ఆదివారం కూడా ఈ పోటీలు కొనసాగుతాయని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, ఏఆర్ఏఎస్పీ శ్రీనివాస్, ఎస్‌బీ డీ ఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మెడల్ ప్రధానం చేస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

సీఎస్ ఆర్ఎంవోగా డా. రాజ్‌కుమారి



జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, జీజీహెచ్, సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (సీఎస్ ఆర్ ఎంవో)గా డా.నేతల రాజ్‌కుమారిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు డీసీఎస్ ఆర్ఎంవో (ఇన్‌చార్జ్ సీఎస్ ఆర్ఎంవో) గా ఇక్కడ పని చేసిన డా. కోనాల అనిత పదోన్నతిపై సీఎస్ ఆర్ఎంవోగా శ్రీకాకుళం జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు.డా.రాజ్‌కుమారి డిప్యూటీ సివిల్ సర్జన్‌గా సామర్లకోట, కొవ్వూరుల్లో పని చేశారు. అనంతరం డిఐవోగా 2023 ఏప్రిల్‌లో పదోన్నతి పొంది రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో పనిచేస్తూ పదోన్నతిలో భాగంగా కాకినాడ జీజీహెచ్‌కు వచ్చారు.

నేటి నుంచి బీచ్ ఫెస్టివల్

సర్పవరం జంక్షన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ బీచ్‌లో సాగర తీర ఉత్సవాలకు ఆదివారం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట సాగరతీరంలో సంబరాలు ప్రారంభం కానున్నాయి. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో క్రిస్మస్, సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఆదివారం నుంచి జనవరి 21వ తేదీ వరకు నెల రోజుల పాటు బీచ్ ఉత్సవాలు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా పారా మోటరింగ్, వాటర్ స్పోర్ట్స్, ఏటీవీ వెహికల్స్, స్పీడ్ బోట్ తదితర వినోదం,ఆహ్లాద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి. శ్రీనివాస కుమార్ తెలిపారు.పారా మోటరింగ్‌ను ఆదివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే పంతం నానాజీ లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు.

సహిత విద్య కార్యక్రమాల అమలుపై అవగాహన

కాకినాడ రూరల్,డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా విభాగం ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్‌లోని విధాన గౌతమి హాల్‌లో జిల్లాలోని అన్ని మండలాల విద్యాశాఖాధికారులకు సహిత విద్య కార్యక్రమాల అమలు మీద అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.పాఠశాల విద్య ఆర్జేడీ జి.నాగమణి మాట్లాడుతూ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం విద్యాప్రణాళికను ఏవిధంగా అమలుచేయాలి, భవిత కేంద్రాల్లో రీసోర్స్‌పర్సన్స్ విధులు తదితర అంశాలపై వివరించారు. అనంతరం ఐఈ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని 21 భవిత కేంద్రాల ద్వారా ఐఈఆర్పీలు దివ్యాంగ విద్యార్థులకు సేవలు సమర్థవంతంగా అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య రాష్ట్ర కన్సల్టెంట్ డాక్టర్ వై.నరసింహ, ఏసీవో జోగిరెడ్డి, ఎంఈవోలు పాల్గొన్నారు.

వేట్లపాలెం ఘటనలో మరో పది మంది అరెస్ట్

సామర్లకోట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వేట్లపాలెం హత్యోదంతంలో నిందితులు మరో పది మందిని శనివారం సాయంత్రం అరెస్ట్ చేసినట్టు సామర్లకోట పోలీసులు శనివారం రాత్రి తెలిపారు. గత ఆదివారం రాత్రి గ్రామంలో దళితచెరువు వద్ద అక్రమంగా నిర్మిస్తున్న ఒక ఇంటికి సంబంధించి రెండు కుటుంబాల మధ్య జరిగిన వివాదం నేపథ్యంలో కత్తులతో దాడులకు దిగడంతో కార్థాల కుటుంబాలకు చెందిన ముగ్గురు దారుణంగా హత్యకు గురైన విషయం విధితమే. గత గురువారం 12 మందిని అరెస్ట్ చేయగా.. తాజాగా మరో 10 మందిని అరెస్టు చేవారు.సామర్లకోట మండలం హుస్సేన్‌పురం శివారు తవ్వడు ఫ్యాక్టరీ రోడ్డులో శనివారం బచ్చుల రాజ్‌కుమార్,బచ్చుల చంద్రరావు, గుల్ల సునీల్‌కుమార్, సీకోటి రాజేంద్ర ప్రసాద్, గుడాల సన్నిబాబు, బచ్చుల జార్జ్, తోలేటి రాంబాబు, గుడాల వినోద్‌కుమార్, కోళ్ళ రాజు, బచ్చుల లక్ష్మణ్‌ను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో ఇప్పటి వరకూ మొత్తం 22 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లైంది.

ఏమీ అర్థం కావడంలేదు.. నిన్నటి వరకూ మా మధ్యనే ఎంతో చలాకీగా తిరిగింది.. ప్రతి రోజూ ఏనుగును చూసేవాడిని.. రేపటి నుంచి కనబడదంటే తట్టుకోలేక పోతున్నాం.. కన్నీటి పర్యంతమవుతూ ఒక పెద్దాయన అన్న మాట..ఆ గ్రామంలో ప్రతి ఒక్కరిదీ ఇదే పరిస్థితి.. ఎందుకంటే ఒకటా రెండా ఏకంగా 19 ఏళ్ల అనుబంధం.. ఏనుగును ఇంట్లో మనిషిలా చూస్తారు..వారు వండుకున్నదే పెడతారు.. అయినా ఏం మాట్లాడదు.. పెట్టింది తిని ఆశీర్వదించి వెళ్లిపోతోంది.. రేపటి నుంచి ఎవరి వద్ద ఆశీర్వాదం తీసుకోవాలని మరొక పెద్దావిడ కన్నీటి పర్యంతమైంది. శనివారం రఘుదేవపురంలో ఎవరిని కదిపినా ఇదే పరిస్థితి.. ఏనుగు మృతితో ఊరంతా బోరుమని ఏడ్చింది.. ఠీవిగా నడిచి వెళ్లే ఏనుగు.. జీవశ్చవంగా వెళుతుంటే తట్టుకోలేకపోయారు.. సమాధి వరకూ ర్యాలీగా వెళ్లి తుది వీడ్కోలు పలికారు..



ఇక ఎవరు ఆశీర్వదిస్తారు!

ఏనుగు మృతితో రఘుదేవపురంలో విషాదఛాయలు

రాజమహేంద్రవరం/సీతానగరం, డిసెంబరు 21 ఆంధ్రజ్యోతి : ఏనుగును చూస్తే ఎవరైనా భయపడతారు.. ఆ గ్రామంలో మాత్రం దాని దగ్గరకు వెళ్లి ఆశీ ర్వాదం తీసుకుంటారు. మిగిలిన జంతువులు రోడ్డుపై ఎలా వెళ్లిపోతాయో.. ఏనుగు అంతే.. ఇదెక్కడో మారుమూల కాదు.. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురంలో పరిస్థితి.. నిన్నటి వరకూ ఆ ఏనుగు జనంతో మమేకమై నడిచింది.. ఏం జరిగిందో ఏమో కానీ శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత కన్నుమూసింది.దీంతో మన జిల్లాలోనూ ఒక ఏనుగు ఉం దని ప్రపంచానికి తెలిసింది.ఆ ఏనుగును చూసేందుకు తండోప తండాలుగా జనం తరలివ చ్చారు. విగతజీవిగా పడి ఉన్న గజేంద్రుడిని చూసి చలించిపోయారు. లేమ్మా అంటూ లేప డానికి ప్రయత్నించారు. అయినా కదలికలేదు. ఏనుగులు 70-80 ఏళ్ల పాటు జీవిస్తాయి. కానీ 'లీలావతి' 18 ఏళ్లకే కన్ను మూయడం ఆ గ్రామస్తులను కలచి వేసింది.అటవీశాఖ అనుమతి మేరకు శనివారం సాయంత్రం పెదకొండేపూడి గ్రామంలోని చిట్టిబాబాజీ ఆశ్రమానికి చెందిన గోసాల సమీపంలో సమాధి చేసి అంత్యక్రియలు నిర్వహించారు. బాజా భజంత్రీల మధ్య లీల మృతదేహాన్ని పెదకొండేపూడి తీసుకెళ్లారు

2 గంటలు మృత్యువుతో పోరాడి..

ఆ మూగజీవి తన ప్రాణాలు ఎవరైనా కా పాడతారని చివరి క్షణం వరకూ కొట్టు మిట్టాడినట్లు పరిస్థితులు చెబుతున్నాయి. అజీర్తి వల్ల ఎక్కువగా ఇబ్బంది వస్తే కడుపు నొప్పి విపరీతంగా వస్తుంది. ఆ సమయంలో ఏనుగు ప్రవర్తన మారిపోతుంది. కళ్లలోంచి నీళ్లు వస్తాయి. శరీరం లోపల గ్యాస్ పట్టేయడం వల్ల అరవడానికి చాలా ఇబ్బంది అవుతుంది. దీంతో తొండాన్ని నేలపై కొడతాయి. లీలావతి కూడా ఇలా చేసినట్టు తెలుస్తోంది. ఆమ్లాల ఉత్పత్తి అధికం కావడంతో కడుపులో ఫర్మెంటేషన్ బ్యాక్టీ రియా చనిపోయి విపరీతంగా గ్యాస్ పుడు తుంది. అలాంటి సమయంలో కూడా కనీసం రెండు గంటలపాటు తీవ్రంగా ఇబ్బంది పడుతుం ది. అప్పటికీ పట్టించుకోకపోతే అకస్మాత్తుగా కిందప డిపోయి ప్రాణాలు విడుస్తుంది. ఇప్పుడు లీల విషయంలో కూడా అదే జరిగిందా? అనే అనుమానాలు వినిపిస్తున్నాయి. రాత్రి సుమారు 9 గంటల నుంచి చాలా ఇబ్బంది పడి 11.30 గంటల సమయంలో కింద పడిపో యింది. గంట తర్వాత 12.25 గంటలకు తుదిశ్వాస విడిచింది.సాధారణంగా మనిషికి రోజుకు 10 కిలోల వరకూ గ్యాస్‌వాయువులు ఉత్పత్తి అయితే..ఏనుగులకు అంతకు పదింతలు అవుతుంది.

- కన్నీటి పర్యంతమైన గ్రామస్తులు
- తండోపతండాలుగా వచ్చిన జనం
- రేపటి నుంచి ఎలా అని ఆవేదన
- పెదకొండేపూడిలో ఖననం
- ర్యాలీగా వెళ్లిన జనం
- అజీర్తా.. గుండెపోటా?



ఏనుగు మృతదేహంపై పూలు చల్లుతున్న ఎమ్మెల్యే

అసలేం జరిగింది?

లీల శుక్రవారం రాత్రి 7.30గంటల సమ యంలో బాగానే ఉంది. రాత్రి 11.30 గంటల సమయంలో ఒక్కసారిగా కింద పడిపోవడంతో దాని బాగోగులు చూసే మావటిలు తిరు చూర్‌లోని వైద్యుడికి ఫోన్ చేశారు. స్థానిక వైద్యులను వెంటనే రప్పించాలని ఆయన సలహా ఇచ్చారు. స్థానిక వైద్యుడు వచ్చేసరికే లీలావతి కొనఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. తొండం అచేతనమైపోయింది. చెవులు నెమ్మదిగా ఊగుతున్నాయి.కళ్లల్లో జీవం దాదాపుగా పోయింది. డాక్టరు వచ్చి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.లీల మరణ సమయానికి 4 టన్నుల బరువు ఉంది.అది సాధారణ బరువే. ఈ వయసులో ఇవి రోజుకు 60 కిలోల వరకూ తింటాయి.అయితే ఈ ఏనుగు మరణానికి సివియర్ ఎసిడోసిస్ కారణంగా తెలుస్తోంది. ఈ జంతువు తిని అరిగించుకునేవి కాకుండా భక్తులు ఇష్టానుసారం అన్నం, ఇడ్లీలు వంటివి పెట్టడంతో అజీర్తి చేసి.. కడుపులో లాక్టిక్ యాసిడ్ ఉత్పత్తి ఎక్కువై గ్యాస్ అధికంగా విడుదలయ్యే అవకాశం ఉంది.అలా జరిగితే ఊపిరితిత్తులకు గాలి సర పరా నిలిచిపోయి వాటితో పాటు, గుండె ఆగిపోయి మరణిస్తాయి.

2009 నుంచి ఇక్కడే..

ఏనుగులు దేవాలయాల్లో, ఆశ్రమాల్లో ఉండడం కొత్త కాదు. మనకు తక్కువ గానీ కేరళ, తమిళనాడులో దాదాపు ప్రతి ప్రఖ్యాత దేవాలయంలో ఏనుగులు భక్తులకు ఆశీర్వాదాలను అందిస్తూ వారిచ్చిన దక్షిణను ఒడుపుగా తొం డంతో అందుకుంటాయి.మన జిల్లాలోనూ నిన్నటి వరకూ అటువంటి ఆశ్రమం ఒకటి ఉండేది. ఆ ఆశ్రమానికి వెళితే ఏనుగు ఆశీర్వదించేది.. 2009వ సంవత్సరం ఆగస్టు 10వ తేదీన అప్పటి అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి జార్జిఖండ్ సీతానగరం మండలం రఘుదేవపురంలోని సద్గురు శ్రీ చిట్టిబాబాజీ సంస్థానం చారిటబుల్ ట్రస్ట్‌కు 3.5 ఏళ్ల వయసున్న ఏనుగును బహూకరించారు. ఏనుగుకు లీల అని నామకరణం చేశారు.దీనికి ప్రత్యేకంగా ఒక భవనం కూడా నిర్మించారు. అందులోనే మావటిలు ఉండేవారు. ప్రస్తుతం దాని వయస్సు 19 సంవత్సరాలు. మావటిలు ప్రతి రోజూ తెల్లవారుజామున గోదావరి నది స్నానానికి తీసువెళ్లేవారు. తిరిగి వస్తూ మార్గమధ్యంలో భక్తులు పెట్టిన పండ్లు, స్వీట్లు, బ్రెడ్లు ఎవరికి తోచినది వారు తినిపించి లీల ఆశీర్వాదం తీసుకునేవారు.చిన్నతనం నుంచి గ్రా మంలోనే ఉండడంతో గ్రామస్తులను ఎంతో మచ్చిక అయ్యింది.రేపటి నుంచి లీల ఆశీర్వాదం దొరకదన్న వార్త స్థానికులను కలచివేస్తోంది. గ్రామస్తులకు కన్నీళ్లు మిగిల్చింది.



రఘుదేవపురంలో అటవీ అధికారుల విచారణ

మృతిపై విచారణ చేస్తున్నాం..

ఇప్పుడు చనిపోయిన ఏనుగు వయసు 18 ఏళ్లు. ఆశ్రమం మనోభావాలకు అనుగుణంగా నిబంధనల ప్రకారం ఖననం చేస్తాం. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ని పాటిస్తాం. మరణానికి కారణాలపై విచారణ మొదలు పెట్టాం. వైద్యుల ప్రాథమిక అంచనా ప్రకారం గుండెపోటుగా భావిస్తున్నాం. పోస్టుమార్టం రిపోర్టు 10 రోజుల్లో వచ్చే అవకాశం ఉంది. ఆ రిపోర్టు ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం.

- రవీంద్ర ధామా, తూర్పు అటవీ అధికారి

ఇలా చేస్తే బతికేదేమో!

ఏనుగు ఒక కేజీ తినేసోడాను ఐదారు లీటర్ల నీటిలో కలిపి పట్టించాలని వైద్యులు చెబుతున్నారు.తినేసోడా అందుబాటులో లేకపోతే కనీసం ఉప్పు నీళ్లయినా పట్టించాలని అంటున్నారు. అలా చేస్తే జీర్ణ వ్యవస్థ కుదుట పడుతుంది. లీలావతి విషయంలో కూడా ముందుగా దానికి గమనించి తినేసోడా లేదా ఉప్పు నీళ్లు పట్టిస్తే డాక్టరు వచ్చే వరకైనా ప్రాణాలు నిలిచేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రోజూ బ్రెడ్ పెట్టేవాడిని..



లీల రాగానే రోజూ ఉదయం షాపులోని బ్రెడ్ పెట్టి ఆశీర్వాదం తీసుకునే వాడిని.. బ్రెడ్ తిన్నాక తొండం తలపై పెట్టి ఆశీర్వదించేది. లీలకు ఆహారం పెడితే వ్యాపారం బాగుంటుందనేది నమ్మకం. లీల మరణించిందన్న వార్త బాధ కలిగించింది. **- అల్లు నరసింహామూర్తి, స్వీట్స్ షాపు యజమాని**

చాలా బాధగా ఉంది..



ఏ పని ప్రారంభించినా లీల ఆశీర్వాదం తప్పనిసరి.. నేను పనిమీద వెడుతున్నాను. శుభం కలగాలని కోరుకునే వాడిని, నా పనులు విజయవంతంగా పూర్తయ్యేవి. ఇప్పుడు లీల మరణించిందని తెలిసి చివరిసారిగా చూసాను.చాలా బాధ అనిపించింది

- మారుతి సాయిచంద్, సీతానగరం

అరటి పండ్లు పెట్టేవాడిని..



నేను రోజూ ఏనుగుకు అరటి పండ్లు పెడితే తిని ఆశీర్వదించేది. లీలకు ఏ రోజైనా పండ్లు పెట్టకపోతే మనశ్శాంతిగా ఉండేది కాదు.దానికి ఆహారం పెట్టి ఆశీర్వాదం తీసుకునేవాళ్లం. ప్రతి రోజూ ఉదయం లీల ఎప్పుడు వస్తుందా అని చూసేవాళ్ళం

- మురకొండ రామకృష్ణ , పండ్ల వ్యాపారి

టిఫిన్ పెడితే తినేది..



లీల (ఏనుగు) అంటే మాకు సెంటిమెంట్. రోజూ ఉదయం షాపు వద్దకు రాగానే మా హోటల్లో చేసిన టిఫిన్స్ తలో రకం పెట్టేవాళ్లం ఆ టిఫిన్ తిని మమ్మల్ని ఆశీర్వదించేది. రోజు దాని రాకకోసం ఎదురుచూసేవాళ్లం .. ఏనుగు రాకపోతే మాకు డల్‌గా ఉండేది.

- కుంచే సాయి, హోటల్ యజమాని



వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రదక్షణలు నిర్వహిస్తున్న భక్తులు



వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38.53 లక్షలు

ఆత్రేయపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి గోదావరి జలాలతో స్నపనమూర్తులకు అభిషేకం నిర్వహించి తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38,53034 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

సత్యదేవా నిత్యాన్నదానం ట్రస్ట్‌కు రూ.3.44 లక్షల విరాళం





ఈవోకు రూ.2.44 లక్షలవిరాళం అందజేస్తున్న వీర్ల సూరిబాబు బ్రదర్స్, రూ 1,11,116 విరాళం అందజేస్తున్న గుమ్మడి గురునాథరావు

అన్నవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన ట్రస్ట్‌కు శనివారం ఇద్దరు దాతల నుంచి రూ 3.44 విరాళంగా సమకూరాయి. అన్నవరంనకు చెందిన వీర్ల సూరిబాబు, చక్రరావు, రాము సోదరులు రూ 2,44,348 విరాళంగా సమర్పించగా విశాఖపట్నంనకు చెందిన గుమ్మడిగుర్నాధరావు రూ.1,11,116 అందించారు. దాతలు వేర్వేరుగా ఈ మొత్తాలను ఈవో వీర్ల సుబ్బారావుకు అందించగా దాతలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, ఏఈవో కొండలరావు పాల్గొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 9గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై బాజాభజంత్రీల నడుమ తోడ్కొనివచ్చి తూర్పు రాజగోపురం ఎదురుగా అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షణ గావించారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



రావులపాలెం సీఆర్సీలో కబడ్డి పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రావులపాలెం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర కబడ్డీ అసోషియేషన్, సీఆర్సీ సంయుక్త ఆధ్వర్యంలో 22, 23, 24, 25 తేదీలలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గొలుగోరి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ అన్నారు. రావులపాలెం సీఆర్సీ ఛాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సీఆర్సీ ఆధ్వర్యంలో 50వ రాష్ట్రస్థాయి బాలురు, బాలికల జూనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభి స్తామన్నారు. స్థానిక సీఆర్సీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ కబడ్డీ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈ కబడ్డీ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు ఉత్తరాఖాండ్‌లో జరిగే నేషనల్ పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సీఆర్సీ ప్రధాన కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, స్పోర్ట్స్ డైరక్టర్ నల్లమిల్లి వీరరాఘవరెడ్డి, చిర్ల కనికిరెడ్డి పాల్గొన్నారు.



ఐటీ చూస్తోంది..

- పెద్దాపురం(ఆంధ్రజ్యోతి) :

- ఆదాయపు పన్ను శాఖ ఆపరేషన్స్ వెరీ స్పెషల్


వివిధ కోణాల్లో ఆరా..రైడ్స్

అదాయ పన్ను (ఐటీ) శాఖ సోదాలు చేయాలంటే ఆషామాషీ కాదు. లక్షిత వ్యక్తులు, వారి సన్నిహితులు, బంధువులు, ఉద్యోగులు, ఇలా అందరి ఇళ్లలో ఏకకాలంలో దాడులు జరుపుతుంటారు. ఇంతమంది ఇళ్లలో ఒకేసారి, ఒకే సమయంలో సోదాలు ఎలా సాధ్యం..? ఇంటి తలుపులు తట్టి.. వుయ్ ఆర్ ఫ్రమ్ ఐటీ డిపార్ట్‌మెంట్ అంటూ చకచకా ఇంట్లోకి వెళ్లి అందరి దగ్గర సెల్‌ఫోన్లు తీసుకోవడంతో పాటు ల్యాండ్ లైన్ ఫోన్ డిస్‌కనెక్ట్ చేసేస్తారు. ఇల్లు, కార్యాలయాల్లో ఇలా సోదాలు జరుగుతుండగానే గేటు దగ్గర భద్రతా సిబ్బంది లోపలివారు బయటకు వెళ్లకుండా, బయటి వారు లోపలికి రాకుండా పహారా కాస్తారు. ఒకే సమయంలో వేర్వేరు ప్రాంతాల్లో అంతా ఒకేలా జరిగిపోతుంటుంది. ఇదెలా సాధ్యం..?

సమాచారం ప్రధానం..

పన్ను ఎగవేతదారులు, పెద్దమొత్తంలో లెక్కల్లో లేని నగదు కలిగి ఉన్నవారి సమాచారం ఐటీ శాఖకు రెండు రకాలుగా అందుతుంది. ఒకటి ఎవరైనా ఫిర్యాదు చేయడం, రెండోది ఐటీ విభాగం తన ఇన్‌ఫార్మర్ వ్యవస్థ ద్వారా నిఘా పెట్టడం. ఐటీ శాఖ ఇన్‌ఫార్మర్ వ్యవస్థ అంత గోప్యంగా ఉంటుంది. వారు ఎవరి సమాచారం సేకరిస్తున్నారనేది ఎవ్వరికీ తెలియదు. ఆరోపణలు వచ్చిన వ్యక్తి, అతని సన్నిహితులకు సంబంధించి భౌతిక ఆధారాలతో పాటు భారతీయ టెలిగ్రాఫ్ చట్టం ప్రకారం అవసరమైన వివరాలు సేకరిస్తారు. ప్రధాన టార్గెట్, అతని సన్నిహితులు, ఎవరెవరి వద్ద నగదు లేదా ఆధారాలు ఉండే అవకాశం ఉంటుందో వారి ఇళ్లు, కార్యాలయాలు, గెస్ట్ హౌస్‌లు, ఫామ్‌హౌస్‌ల వివరాలు తెలుసుకోవడం, ఏఏ సమయాల్లో ఎక్కడెక్కడికి వచ్చి వెళుతుంటారు..? ఇలా ప్రతీ అంశానికి సంబంధించి పక్కాగా సమాచారం సేకరిస్తారు. ఇందుకోసం ఐటీ బృందాలు సోదాలు నిర్వహించాల్సిన వ్యక్తి స్థాయిని బట్టి కొన్ని రోజులు, నెలలు అత్యంత గోప్యంగా సమాచారం సేకరిస్తారు. ఉదాహరణకు ఐటీ సోదాలు నిర్వహించాల్సిన వ్యక్తి సమాచారాన్ని సేకరించిన తర్వాత అధికారులు దాన్ని ఢిల్లీ ప్రధాన కార్యాలయానికి అందచేస్తారు. ఐటీ విభాగం ప్రిన్సిపల్ డైరెక్టర్ అనుమతి మేరకు వారెంట్ తీసుకుంటారు.





ఒక వ్యక్తికి సంబంధించిన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఉద్యోగుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించాల్సి వచ్చినప్పుడు డాట్ టు డాట్ కనెక్షన్ విధానాన్ని ఐటీ అధికారులు అనుసరిస్తారు. ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి ఉన్న లింకులనే డాట్ టు డాట్ కనెక్షన్ అంటారు. ఒకసారి ఒక విభాగానికి చెందిన వ్యక్తి, వ్యవస్థపై సోదాలు చేస్తే వెంటనే అదే విభాగానికి చెందిన ఇతరులపై ఐటీ సోదాలు చేయదు. కొంత సమయం తీసుకుంటుంది. మరో విభాగానికి చెందిన వ్యక్తి, సంస్థపై దృష్టి సారిస్తుంది. అయితే స్థానిక పోలీసులు, సీఐడీ, ఇతర నిఘా విభాగాల్లో ఎక్కడైనా చిన్నపాటి నిబంధనల అతిక్రమణ జరిగే అవకాశం ఉండొచ్చు. కానీ ఐటీలో కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందే. ఐటీ అధికారులు కేవలం సోదాలు నిర్వహించడం, లెక్కలు సరిచూడడం, లెక్కల్లో లేని నగదు, నగలను స్వాధీనం చేసుకోవడం వరకే పరిమితం అవుతారు. నేరుగా కేసులు నమోదు చేయడం సాధ్యం కాదు. లెక్కల్లో లేని నగదుకు సంబంధించి పన్ను, జరిమానా విధించి వసూలు చేస్తారు. ఐటీ సోదాలు పైకి కనిపించేంత సులువుగా ఉండవు. ఒక్కోదానికి సంబంధించి వెనకాల కొన్ని నెలల పాటు పనిచేయాల్సి ఉంటుంది. సోదాలకు సంబంధించిన సమాచారం పరిమిత అధికారులకు మాత్రమే తెలుస్తుంది.



స్ట్రైక్ టైం కీలకం

వేర్వేరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించాల్సిన సందర్భాల్లో స్ట్రైక్ టైం నిర్ధారిస్తారు. ఉదాహరణకు శ్రీలలితా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేతల నివాసంతో పాటు ఆయన కుటంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సిబ్బంది, ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలకు తెల్లవారుజామున 5.30 గంటలు స్ట్రైక్ టైంగా నిర్ధారిస్తే సరిగ్గా అదే సమయానికి అన్నిచోట్ల సోదాలు ప్రారంభం కావాల్సిందే. అంత కచ్చితంగా జరగాలంటే స్ట్రైక్ టైం కంటే కొంత సమయం ముందే ఐటీ బృందాలు సమీప ప్రాంతానికి చేరుకుని ఉంటాయి. ఇలా చేయకపోతే ఒక సమయంలో ఒకచోట సోదాలు జరుగుతుంటే విషయం తెలుసుకుని మరో చోట ఉన్నవారు పరారవడం, ఆధారాలు మాయం చేసే అవకాశం ఉండడంతో ఐటీ సోదాల్లో స్ట్రైక్ టైం అత్యంత కీలకం.

కేంద్ర బలగాలు

ఐటీ సోదాల సమయంలో భద్రత మరో కీలక అంశం. సోదాలకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చిన తర్వాత భద్రతా సిబ్బంది సహకారం తీసుకుంటారు. గతంలో ఐటీ సోదాలు నిర్వహించే ప్రాంతానికి సంబంధించి స్థానిక పోలీసుల సహకారం తీసుకునేవారు. ముందుగానే వారికి విషయం చెప్పాల్సి రావడం వల్ల కొన్ని సందర్భాల్లో అవతలి వ్యక్తికి సమాచారం వెళ్లినట్లు గుర్తించారు. దీంతో ఐటీ సోదాల సమయంలో స్థానిక పోలీసులు కాకుండా కేంద్ర బలగాలను వెంట తీసుకువెళుతున్నారు. దాడులకు కొన్ని గంటల ముందు సీఆర్‌పీఎఫ్ బలగాలు ఐటీ కార్యాలయానికి చేరుకుంటాయి.

ఎలా సాధ్యం

ఇటీవల పెద్దాపురం శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ నివాసంతో పాటు ఆయన బంధువులు, స్నేహితులు, ఇళ్లు, కార్యాలయాలు, ఆయా సంస్థల్లో పనిచేసే కొంతమంది ఉద్యోగుల ఇళ్లు ఇలా ఒకే సమయంలో పదుల సంఖ్యలోని వేర్వేరు ప్రాంతాల్లో ఐటీ బృందాలు ఏకకాలంలో సోదాలు జరిపాయి. ఎవరిపై అయినా ఇలాగే దాడులు జరుగుతాయి. తెల్లవారకముందే ఇంటికి వచ్చి కాలింగ్ బెల్ ఎలా నొక్కుతున్నారు..? వారికి అన్ని అడ్రస్‌లు ఎలా తెలుసు..? ఐటీ దాడులు ఎదుర్కొంటున్నవారే కాదు, సాధారణ ప్రజలు, ప్రముఖుల్లోనూ ఇప్పుడు ఇదే ప్రశ్న. పక్కా సమాచారంతోనే ఐటీ అధికారులు సోదాలు చేపడతారు. 'మా సంస్థల్లో పనిచేస్తున్న కొంతమంది క్లర్కుల ఇళ్లలోనూ ఐటీ బృందాలు సోదాలు జరిపాయి. కొన్ని సంవత్సరాలుగా వారు మా వద్ద పనిచేస్తున్నా వారి చిరునామా మాకు తెలియదు. మరి ఐటీ అధికారులకు ఎవరు చెప్పారో..? అని బాధితులు చర్చించుకుంటున్నారు.

సీల్డ్ కవర్‌లో..

సోదాలకు అనుమతులు ఇచ్చిన తర్వాత స్థానికంగా ఉండే ఐటీ అధికారులు ఎన్ని ప్రాంతాల్లో సోదాలు జరపాల్సి ఉంటుందనే సమాచారం మేరకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకుంటారు. ఒకటి, రెండు ప్రాంతాల్లో సోదాలకు 20, 30 మంది సిబ్బంది సరిపోతారనుకుంటే స్థానికంగా ఉండేవారిని వినియోగించుకుంటారు. వేర్వేరు ప్రాంతాల్లో సోదాలు జరపాల్సి రావడం, వందల సంఖ్యలో సిబ్బంది అవసరం ఏర్పడితే ఇతర రాష్ట్రాల నుంచి రప్పిస్తారు. ఒకరోజు ముందుగానే స్థానిక హెడ్ క్వార్టర్లలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు హోటళ్లలో బస చేస్తారు. సాధారణ వ్యక్తుల మాదిరిగానే ఉంటారు. సోదాలు జరిగే రోజు అవసరాన్ని బట్టి అర్ధరాత్రి తర్వాత, తెల్లవారుజామున ప్రధాన కార్యాలయానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఒక్కో బృందాన్ని నడిపే బాధ్యతలు ఒక అధికారికి అప్పగిస్తారు. వారికి సీల్డ్ కవర్‌లో టార్గెట్‌కు సంబంధించిన వివరాలు అందజేస్తారు. సోదాలు జరిపే వ్యక్తి నివాసం, కార్యాలయం సమీపంలోని ల్యాండ్ మార్క్ చెప్పి పంపుతారు. అక్కడికి వెళ్లిన తరువాత సీల్డ్ కవర్ తెరిచి చూస్తే టార్గెట్ ఎవరు, అడ్రస్ ఎక్కడ అనేది తెలుస్తుంది.

స్వాగతం - సుస్వాగతం





సాధారణ జీవనానికి చిరునామా అతడు...
సామాన్య జనానికి దగ్గరగా ఉండేవాడు...
భవిష్యత్తరాల గురించి ఆలోచించేవాడు...
ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి...
పట్టుదలతో ఎంపీగా ఎదిగినవాడు...
చాలా మందికి **సానా** గా
సుపరిచితుడైన వాడు...
శ్రీ సానా సతీష్ బాబు గారు
రాజ్యసభ సభ్యుడిగా
ప్రమాణ స్వీకారం చేసి
నేడు మొట్టమొదటి సారిగా కాకినాడ
విచ్చేస్తున్న శుభ సందర్భంగా వారికివే
మా హృదయ పూర్వక
స్వాగత శుభాకాంక్షలు...
మీరు భవిష్యత్తులో
మరెన్నో ఉన్నత పదవులు
అధిరోహించాలని
మనసారా కోరుకుంటూ...

శ్రీ సానా సతీష్ బాబు గారు
రాజ్యసభ సభ్యులు

చోడే అనిల్ కుమార్ కాకినాడ	**గుజ్జర్లపూడి రాజేష్** ముంబాయి	**దేశంశెట్టి రాజా** (బ్లూస్టార్ రాజా) కాకినాడ
ఉంగరాల సతీష్ YAX 'n' YAX కాకినాడ	**పులివర్తి శ్రీనివాస్ చౌదరి** హైదరాబాద్	T.V.RAO M.Tech(struct) Managing Director B.R.PRASAD REDDY B.Tech(Mech) Executive Director **SRT ENGINEERS PVT.LTD.,** KAKINADA-HYDERABAD
రాజరపు మహేష్ కాకినాడ	**వట్టికూటి భాస్కర్** BAKERS INN Since 1990 కాకినాడ	**వల్లూరి శ్రీనివాస్** మాజీ సర్పంచ్, వేట్లపాలెం

శృంగారవల్లభస్వామి ఆలయంలో రద్దీ

పెద్దాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి గ్రామంలో శృంగారవల్లభస్వామిని శనివారం అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి రూ.1,74,675 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రూ.40 కోట్లతో బీసీ రెసిడెన్షియల్ పాఠశాల

ఎమ్మెల్యే చిన రాజప్ప

పెద్దాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలో రూ. 40 కోట్ల వ్యయంతో బీసీ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం త్వరలో చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించి పట్టణ పరిధిలో ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని ఆయన శనివారం పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుబడిందన్నారు. పట్టణాభివృద్ధిపై పూర్తిగా నిర్లక్ష్యం వహిందన్నారు. నిలిచిపోయిన అభివృద్ధి పనులను మళ్లీ ప్రారంభిస్తామన్నారు. రహదారులను పూర్తిస్థాయిలో మెరుగుపరచనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, రాజాసూరిబాబురాజు, ఎలిశెట్టి నాని తదితరులు ఉన్నారు.

'వాయు కాలుష్య నివారణకు చర్యలు'

సర్పవరం జంక్షన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సముద్రతీర ప్రాంతం నుంచి వస్తున్న వాయు కాలుష్యం నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా కాలుష్య నియంత్రణ మండలి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకరరావు తెలిపారు. ఇటీవల కాకినాడ రూరల్ సముద్ర తీర ప్రాంతంలో గల కంపెనీల నుంచి దుర్వాసనతో కూడిన వాయు కాలుష్యం వస్తున్నట్టు ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూర్యారావుపేట, వాకలపూడి ప్రాంతంలో గల పలు పరిశ్రమలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఇందులో ఓ కంపెనీకి చెందిన ముడి సరుకుకి బదులుగా వేరొక ముడి సరుకు రావడంతో దుర్వాసన వచ్చినట్లు గుర్తించామన్నారు. తక్షణం కాలుష్య నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ శనివారం సదరు పరిశ్రమ నిర్వాహకులకు నోటీసు జారీ చేయడం జరిగిందన్నారు. కంపెనీలు నిర్దేశిత నివారణ చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా కాలుష్యం విడుదల చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మినీ జాబ్‌మేళా

పిఠాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం మినీ జాబ్‌మేళా నిర్వహించారు. దక్కన్ ఫైన్ కెమికల్స్, మెడిప్లస్ ఫార్మసీ, యాక్సిస్ బ్యాంకు, ఇన్నోవాసోర్స్ తదితర కంపెనీలు ప్రతినిధులు రాతపరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఎంపికలు జరిపారు. 86 మంది పాల్గొనగా 32 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. జాబ్‌మేళాలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీ, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ప్రేమ్‌కుమార్, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఎం పోరాటం

రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



బహిరంగ సభలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పెద్దాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేసేది సీపీఎం మాత్రమే అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సీపీఎం జిల్లా మహాసభల్లో భాగంగా శనివారం పట్టణంలో మెయిన్ రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న అధికార ప్రతిపక్ష పార్టీలు అన్నీ కేంద్రంలో ఉన్న బీజేపీకి ఊడిగం చేస్తున్నాయన్నారు. ప్రజలపైన భారాలు వేయడానికి ఇప్పటికే విద్యుత్ చార్జీల మోత ప్రజలపై మోపుతోందన్నారు. ప్రతీ ఇంటికీ ఉద్యోగం అని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగాల సంగతి ఏమైందని ప్రశ్నించారు. ఎర్ర జండా శ్రీలంక, నేపాల్ ఎగురుతోందని.. ఎప్పటికైనా భారత దేశంలో కూడా ఎగరడం తథ్యమన్నారు. అలాగే జిల్లాలో సమగ్ర అభివృద్ధి జరగా లన్నారు. పెద్దాపురం పట్టణంలో ఉన్న సీహెచ్‌సీని ఏరియా ఆసుపత్రిగా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. రేషన్ బియ్యం దోషులపై చర్యలు తీసుకునే దమ్ము కూటమి ప్రభుత్వానికి ఉందా అని శ్రీనివాసరావు ప్రశ్నించారు. మహాసభల సందర్భంగా పట్టణంలో సీపీఎం నేతలు భారీ ర్యాలీ చేపట్టారు. సీపీఎం నేతలు ఎం.రాజశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉమామహేశ్వరావు, నాగేశ్వరరావు, కరణం ప్రసాద్, కేఎస్ శ్రీనివాస్, దువ్వ శేషబాబ్జీ, కూనిరెడ్డి అరుణ, దారపురెడ్డి క్రాంతికుమార్, నీలపాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏలేరు ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్‌గా నాగేంద్ర


ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

పెద్దాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏలేరు ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఛైర్మన్‌గా బస్వా వీరవెంకట నాగేంద్ర (వీరబాబు)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో ఈ ఎన్నిక నిర్వహించారు. కిర్లంపూడి మండలం ముక్కొల్లు డీసీ ఛైర్మన్ బస్వా వీరవెంకట నాగేంద్ర (వీరబాబు)ను అందరూ ప్రతిపాదించడంతో ఆయనను ఏకగ్రీవంగా ప్రకటించారు. అలాగే వైస్ ఛైర్మన్‌గా గొల్లప్రోలు మండలం బి.ప్రత్తిపాడుకు చెందిన ఊటా ఆదివిష్ణును ఎన్నుకున్నారు. ఏలేరు ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న ఆరు డీసీల ఛైర్మన్‌లో ఒకరిని ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్‌గా, వైస్ ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను ఎన్నికల అధికారి జి.శ్రీనివాసరావు సమక్షంలో నిర్వహించారు. అనంతరం అధికారికంగా వీరవెంకట నాగేంద్రను ఛైర్మన్‌గా ఎన్నికల అధికారి ధృవీకరించారు. అలాగే కార్యక్రమానికి పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, డీసీ ఛైర్మన్‌లు, నీటి సంఘాల ఛైర్మన్లు తదితరులు హాజరయ్యారు.

'అందం, ఆరోగ్య పరిరక్షణకు సైక్లింగ్'

సర్పవరం జంక్షన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అందం, ఆరోగ్య పరిరక్షణకు సైక్లింగ్ ఎంతగానో దోహదం చేస్తుందని స్టాన్లీ సైకిల్స్ అధినేత పోతుల స్టాన్లీ అన్నారు. కాకినాడ సైకిల్ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో శనివారం సర్పవరం జంక్షన్ నుంచి వైజాగ్ స్టీల్‌ప్లాంట్ వరకు 150 కిలోమీటర్లు సైక్లింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువకులు, ఔత్సాహికులంతా గ్రూప్‌గా ఏర్పడి సైక్లింగ్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. రోజుకి అరగంట సైక్లింగ్ నినాదం పేరిట ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు రాంబాబు, నవాజ్, వెంకటేష్, స్వామి, రాజ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, రమేష్, దీపక్, ముకేష్ ఉన్నారు.


సైక్లింగ్ యాత్రకు బయలుదేరిన యువకులు

వైద్య వృత్తి పవిత్రమైనది

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్



సభలో మాట్లాడుతున్న డాక్టర్ బాబ్జి

కరప, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తి చాలా పవిత్రమైనదని, తమ వద్దకు వచ్చే పేషెంట్ల పట్ల సహనంతో వ్యవహరించాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి అన్నారు. కాకినాడ జిల్లా కరప మండలం పెనుగుదురులోని కాకినాడ సిమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ కళాశాలలో శనివారం ఫిజియోథెరపీ స్నాతకోత్సవ దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బి.శివశిరీష, డైరెక్టర్ భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సూర్యప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి కోరుకొండ బాబ్జి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పేషెంట్ల పట్ల సహనంతో వ్యవహరించాలని, వారు చెప్పే ఆరోగ్య సమస్యలను ఆసాంతం ఓపిగ్గా విని వైద్యమందిస్తే మంచి డాక్టర్‌గా సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. కళాశాల సెక్రటరీ శివశిరీష ఫిజియోథెరపీ ప్రాముఖ్యత, దాని ఆవశ్యకతను వివరించారు. ఫిజియోథెరపీకి మంచి భవిష్యత్ ఉందని, పుస్తక పఠనం కంటే పేషెంట్‌లకు ట్రీట్మెంట్ చేయడం ద్వారా నేర్చుకున్నది బాగా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు వైద్య పట్టాలు అందించి ప్రతిజ్ఞ చేయించారు. కళాశాలలో ఏర్పాటుచేసిన చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్, కీళ్ల వ్యాధి నివారణ యూనిట్లను ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, రామకృష్ణ, పేరెంట్స్, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు రాక

కాకినాడ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడిగా సానా సతీష్‌బాబు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా ఈ నెల 22న కాకినాడకు విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా పార్టీశ్రేణులు భారీ కాన్వాయ్, స్వాగత ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు మధురపూడి విమానాశ్రయం నుంచి రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కాన్వాయ్‌గా బయలుదేరి సాయంత్రం 6.15 గంటలకు కాకినాడ చేరుకోనున్నారు. ఉదయం 10.30 గంటలకు మధురపూడి విమానాశ్రయం, 11 గంటలకు రాజానగరం, 11.45 గంటలకు మురారి, 12.30 గంటలకు జగ్గంపేట, మధ్యాహ్నం 1 గంటకు ఎర్రవరం, 1.15 గంటలకు ప్రత్తిపాడు, 1.40 గంటలకు ధర్మవరం, 2 గంటలకు కత్తిపూడి, 2.30 గంటలకు గొల్లప్రోలు, 3 గంటలకు పిఠాపురం, 3.45 గంటలకు చిత్రాడ చేరుకుంటారు. సాయంత్రం, 4 గంటలకు తిమ్మాపురం నుంచి బైక్, కార్ ర్యాలీగా బయలుదేరి 4.30 గంటలకు సర్పవరం జంక్షన్ 4.45 గంటలకు నాగమల్లితోట జంక్షన్, 5 గంటలకు భానుగుడి సెంటర్, 5.20 గంటలకు మసీద్ సెంటర్, 5.40 గంటలకు, జగన్నాధపురం బ్రిడ్జి, సాయంత్రం 6 గంటలకు కల్పన సెంటర్, 6.15 గంటలకు కోకిల సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ఏడీబీ రోడ్‌లోని క్యాంపు కార్యాలయానికి బయలుదేరుతారు.

సానా ఫౌండేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

రాబోయే కొత్త సంవత్సరం అందరికీ శుభప్రదంగా ఉండాలని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ పేర్కొన్నారు. కాకినాడలోని ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం ఫౌండేషన్ 2025 నూతన సంవత్సర క్యాలండర్ ఆవిష్కరణ జరిగింది. హరీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ట్రస్టీ, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు సోదరుడు సానా రవి ముఖ్యఅతిథిగా పాల్గొని క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బుజ్జి), నిడదవోలు వీరేంద్ర, తోట నవీన్, గిద్దె కుమార్, గంధం శ్రీను, చక్రధర్, పిడక శేషు, ఛార్లీ, శేఖర్ పాల్గొన్నారు.



ఆర్డీవో, డీఎస్పీ పర్యటన

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తి, కొడవలి గ్రామాల్లో కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, డీఎస్పీ రఘువీర్ విష్ణు శనివారం సాయంత్రం పర్యటించారు. గ్రామాల పరిధిలోని పోలవరం, పుష్కర కాలువల వెంబడి పశువధ జరుగుతున్నట్లు, అక్రమ కబేళాలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎం పవన్‌కు ఫిర్యాదులు అందాయి, డిప్యూటీ సీఎం కార్యాలయం నుంచి అందిన ఆదేశాలతో వారు ఆ గ్రామాల్లో పర్యటించడంతో పాటు పోలవరం, పుష్కర గట్లు పరిశీలించారు. కబేళాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు తహశీల్దార్ సత్యనారాయణ తదితరులున్నారు.

పీడీఎస్ బియ్యం నిందితులు బైండోవర్

కాకినాడ క్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు పంపిణీ చేసే రేషన్ (పీడీఎస్) బియ్యాన్ని గతంలో అక్రమ రవాణా చేసి అధిక ధరకు అమ్ముకున్న కొంత మంది నిందితులను గుర్తించి బైండోవర్ చేసినట్టు స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) వర్గాలు శనివారం రాత్రి తెలిపాయి. పిఠాపురం రూరల్‌లో 12 మంది, జగ్గంపేట పరిధిలో 3, మిగతా చోట్ల ఐదుగురిని మొత్తంగా జిల్లావ్యాప్తంగా 20 మందిని బైండోవర్ చేసినట్టు పేర్కొన్నాయి.

32 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పిఠాపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట ప్రాంతంలోని ఒక ఇంటిలో రేషన్‌బియ్యం నిల్వలు ఉన్నాయన్న సమాచారంతో సివిల్ సప్లైస్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. సదరు ఇంటిలో ఉమామహేశ్వరరెడ్డికి చెందిన 32 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. 6(ఏ), క్రిమినల్ కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్‌సప్లైస్ స్టాక్ పాయింట్‌కు తరలించారు. తనిఖీల్లో పౌరసరఫరాల శాఖ డీటీ వీరాస్వామి, వీఆర్వో కామేశ్వరరావు, గ్రామ రెవెన్యూ సహాయకుడు భాషా తదితరులు పాల్గొన్నారు.

కారంమిల్లుల్లో తనిఖీలు

గొల్లప్రోలు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కారం మిల్లుల్లో ఆహార నియంత్రణ శాఖ, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కారంలో కల్తీ జరుగుతుందన్న ఫిర్యాదుల మేరకు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 5 కారం మిల్లుల్లో శనివారం తనిఖీలు జరిపారు. 4 మిల్లుల్లో కారం, ఒక మిల్లులో పసుపు శాంపిల్స్ సేకరించారు. వాటిని పరీక్షల నిమిత్తం పంపుతున్నట్లు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ తెలిపారు. ఒక మిల్లులో ఉన్న నూకల బస్తాను సీజ్ చేశామన్నారు. వాటి ఫలితాలు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో ఫుడ్ ఇనస్పెక్టర్ సుబ్బారావు, గొల్లప్రోలు తహశీల్దారు కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

'లక్ష్య' వార్షికోత్సవం

కాకినాడ రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాల ప్రాంగణంలో పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, అతిథిగా ఏపీఎస్పీ కమాండెంట్ అధికారిణి దీపిక, ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాల డైరెక్టర్ డాక్టర్ సుగుణ పాల్గొనగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చదువులో రాణించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన, ఒలింపియాడ్, వేదగణితం,అబాకస్ వంటి కాంపిటేటివ్ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పతకాలు, బహుమతులను, షీల్డ్‌లను అందజేశారు. ప్రిన్సిపాల్ వందన బోహ్రా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులున్నారు.

రూ.71,500 మిగులుతో బడ్జెట్ ఆమోదం

● సామర్లకోట మండల పరిషత్ బడ్జెట్ సమావేశం


సామర్లకోట మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ, ఎంపీడీవో

సామర్లకోట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండల పరిషత్‌లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.71,500తో మిగులు బడ్జెట్‌కు సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. శనివారం సామర్లకోట మండల పరిషత్ బడ్జెట్ సమావేశం ఎంపీపీ సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీవో కె.హిమమహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బడ్జెట్ సారాంశాన్ని ఎంపీడీవో కార్యాలయ అధికారులు సభ్యులకు వివరించారు. 2025-26 ఏడాదికి 100 కోట్ల 91 లక్షల 23వేల రూపాయలు ఆదాయం లభిస్తుందని అంచనా వేయగా వ్యయం 100కోట్ల 90లక్షల 51వేల 500 రూపాయలుగా అంచనాలు వేసి రూ.71,500 మిగులుగా ప్రతిపాదించారు. సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం సమగ్రమైన ఆదేశాలు అమలు చేయకపోవడంతో దళారీలతో రైతులు నష్టపోతున్నారని పెదబ్రహ్మదేవం ఎంపీటీసీ మలకల సూర్యారావు ఆవేదన వ్యక్తం చేసారు. మండలంలో పలు గ్రామాల్లో మద్యం బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నారని, వాటిని నిరోధించేలా చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరడంతో ఏకగ్రీవంగా తీర్మానించారు. జడ్పీ సమావేశం శనివారం కాకినాడలో జరగడంతో జడ్పీటీసీ ఎలిశెట్టి అమృతానరేష్ మండల సమావేశానికి హాజరుకాలేదు. సమావేశంపై సభ్యులకు పూర్తిస్థాయిలో ప్రచారం లేకపోవడంతో పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరుకాలేకపోయారు. అధికారుల హాజరు కూడా అంతంతమాత్రంగానే ఉంది.

ప్రభుత్వ సుపరిపాలనకు ప్రజల మద్దతు


కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి దంపతులు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధికి ఆకర్షితులైన ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీ సభ్యత్వాలను స్వీకరిస్తున్నారని, 50వేల సభ్యత్వాలు పూర్తవ్వడమేనని ఇందుకు నిదర్శనమని టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వాలు 50వేలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం వలసపాకల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు నడుమ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత రిఫరల్ ఐడీ ద్వారా 17వేలకుపైగా సభ్యత్వ నమోదు చేయడంతో రాష్ట్రంలోనే 3వ స్థానంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేసి తొలిసారి కాకినాడకు విచ్చేస్తున్న సానా సతీష్‌కు ఆదివారం సాయంత్రం 4గంటలకు సర్పవరం జంక్షన్‌లో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. పార్టీ నాయకులు తాతపూడి రామకృష్ణ, కాళ్ల శ్రీను, పలివెల గాయత్రి, బొజ్జ భవానీ తదితర నాయకులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత


పిఠాపురంలోని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో ధ్యాన సాధనలో పాల్గొన్న భక్తులు

పిఠాపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. పిఠాపురం పట్టణ శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలోని ధ్యాన మందిరంలో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులు ధ్యాన సాధన నిర్వహించారు. ధ్యానం చేస్తే ప్రజలు శాంతి సౌభాగ్యాలతో జీవించవచ్చని అన్నారు. పీఠం సెంట్రల్ కమిటీ సభ్యుడు ఏవీవీ సత్యనారాయణ, కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఎస్.కృష్ణకుమార్ పాల్గొన్నారు.

బాలికోన్నత పాఠశాలలో

పట్టణంలోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించారు. ధ్యాన సాధనపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎంఈవో శ్యాంబాబు, ఇన్‌చార్జి మాధవి, నగీన్, పద్మ, పీఈటీ సత్యప్రియ, పీడీ శేషుకుమారి పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీటి సంఘం ఎన్నికలు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తాటిపర్తి కోదండరాముని చెరువు నీటి సంఘం ఎన్నికలు శనివారం శనివారం పోలీసుబందోబస్తు నడుమ ప్రశాంతంగా జరిగాయి. గతంలో శాంతిభద్రతల సమస్య ఏర్పడటంతో ఎన్నికను వాయిదా వేశారు ఎన్నికల అధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా గొల్లపల్లి కృష్ణ, ఉపాధ్యక్షురాలిగా బావిశెట్టి రామలక్ష్మీ ఎన్నిక కాగా టీసీ సభ్యులుగా కామన వెంకటలక్ష్మి, అవ్వారి సత్యనారాయణ, సైల రామలక్ష్మి, వంకా అమరావతి ఎన్నికయ్యారు.

ఘనంగా రామానుజన్ జయంతి

పిఠాపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. రామానుజన్‌కు ఇష్టమైన సంఖ్య 1729, పిఠాపురం ఆకారంలో పిఠాపురం భాష్యం స్కూలు విద్యార్థులు ఒదిగారు. అనంతరం నిర్వహించిన మేథ్స్ ఎక్స్‌పోలో విద్యార్థులు ప్రదర్శించిన అంశాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. రామానుజన్ కాలిబర్ టెస్టులో విజేతలకు ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం వీవీవీ రామకృష్ణ బహుమతులు అందజేశారు. భాష్యం ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ హెచ్ఎం అరుణ పాల్గొన్నారు.

పెనుమర్తిలో..

సర్పవరం జంక్షన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): యంగ్ మైండ్స్ (రేపటి కోసం) స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత వాకాడ వెంకటరమణ (చిన్న) ఆధ్వర్యంలో శనివారం కాకినాడ రూరల్ పెనుమర్తి శారదా విద్యాలయంలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పదో తరగతి గణితంలో టాపర్స్‌గా నిలిచిన పలువురు విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. స్కూల్ హెచ్ఎం ఎం నూకరాజు, గణిత ఉపాధ్యాయులు కుమార్, సీతారత్నం, శ్రీదేవి, లక్ష్మణ్, దుర్గాప్రసాద్, శంకర్, రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి

సామర్లకోట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణ పరిధిలో వసూళ్ల లక్ష్యాలను సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య నిర్దేశించారు. శనివారం సామర్లకోట మున్సిపల్, రెవెన్యూ సిబ్బందితో కమిషనర్ శ్రీవిద్య ఆదాయ సమీకరణపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా బిల్లు కలెక్టర్ల వారీగా బకాయిలు, వసూళ్లు, బకాయిల లక్ష్యాలపై చర్చించారు. సామర్లకోట పట్టణంలో 16,921 అసెస్‌మెంట్ల నుంచి పన్ను డిమాండ్‌గా రూ.8.74కోట్ల వసూళ్లకు శనివారం నాటికి కేవలం రూ.2.50కోట్లు మాత్రమే వసూలు చేశారని కమిషనర్ వివరించారు.

జనసేన నేతల సంబరాలు

పిఠాపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో జనసేన నేతలు సంబరాలు నిర్వహించారు. నీటి సంఘాల ప్రాజెక్టు కమిటీ ఎన్నికల్లో రెండు పదవులు పిఠాపురం నియోజకవర్గ జనసేన నేతలకు లభించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌గా పీబీసీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ-1 ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, ఏలేరు ప్రాజెక్టు కమిటీ వైస్‌ఛైర్మన్‌గా గొల్లప్రోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ ఊటా నానిబాబు ఎన్నికయ్యారు. పిఠాపురం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. బాణసంచా కాల్చారు.

బాలల భవితకు బాసటగా బాలల గ్రామసభలు


బాలల గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు శ్రీరామాంజనేయులు, పాండురంగారావు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలల భవితకు బాసటగా నిలిచేలా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా బాలల కోసం ప్రత్యేకంగా బాల గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్‌డీ, గ్రామ ప్రత్యేకాధికారి శ్రీరామాంజనేయులు తెలిపారు. శనివారం వాకలపూడి హైస్కూల్లో గ్రామ కార్యదర్శి పిడుగు పాండురంగారావు ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ వ్యవస్థ, బాల, బాలికల భాగస్వామ్యంపై ప్రత్యేకంగా బాలల గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం మహిళలు, బాలల కోసం ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తుందన్నారు. ఈసభల్లో బాల, బాలికల అవసరాల కోసం తీసుకోవాల్సిన చర్యలు, బడ్జెట్ కేటాయింపులు తదితర 8 అంశాలపై చర్చించి ఆమోదించి, బాలల ఏకగ్రీవ సమ్మతితో తీర్మానం చేస్తామన్నారు. ఈతీర్మానం మేరకు పంచాయతీ బడ్జెట్‌లో ప్రవేశపెట్టి కేటాయింపులు చేయడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా గ్రామ కార్యదర్శి పిడుగు పాండురంగారావు గ్రామసభలు నిర్వహణ, ఆదాయ, వ్యయాలు, అజెండా, తీర్మానాలు, కేటాయింపులు, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, సైబర్ క్రైం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం సూర్యనారాయణ, స్కూల్ కమిటీ ఛైర్మన్ కుండల మణికంఠ యాదవ్, కూటమి నాయకులు గంటా ప్రసాద్, గేదెల చిన్న పాల్గొన్నారు.

బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌లో ఉచిత శిక్షణ

కాకినాడ సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బాలికలకు ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్‌లో ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని శనివారం స్థానిక జగన్నాధపురం చర్చి స్క్వేర్ సెంటర్‌లోని బచ్చు రామం మున్సిపల్ బాలికల పాఠశాలలో ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే ఎంపీల సహకారంతో మల్లాడి రామారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మల్లాడి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఉభయగోదావరి జిల్లాల మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ నేడు సమాజంలో ఎదురవుతున్న సంఘటనల నేపథ్యంలో ప్రతి బాలిక తమను తాము రక్షించుకునేందుకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎన్‌వీ సరోజినిదేవి, కోచ్ ప్రత్యూష, ట్రస్ట్ సభ్యులు వీర దుర్గాప్రసాద్, భాస్కర్, అశోక్, నాగేంద్ర, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్థివ శివ లింగాలకు అభిషేకపూజలు

సామర్లకోట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మఠం సెంటర్‌లో వేంచేసియున్న శ్రీవీరభద్ర శ్రీరామాలయం ఆవరణలో పదిహేను రోజులుగా ఆలయ మహిళా భక్త బృందం తయారుచేస్తున్న లక్ష పార్థివ శివలింగాలు పూర్తి కావడంతో శనివారం వాటికి. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో క్షీరాభిషేక పూజలు, హోమపూజలు ఘనంగా నిర్వహించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

జగ్గంపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుర్రప్పాలెం గ్రామంలో కరుణామయుడు స్టీల్స్ అధినేత ఉలిశెట్టి తాతాజీ ఇంటి వద్ద నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాస్టర్ యాకబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం తుమ్మలపల్లి రమేష్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

వేటగాళ్లకు చిక్కిన దుప్పి

● అధికారులకు వచ్చిన సమాచారంతో సోదాలు
● ఓ ఇంటిలో వేటమాంసం..గ్రామ శివారులో దుప్పిని చంపిన ఆనవాళ్లు



గ్రామ శివారులో దుప్పి చర్మాన్ని కాల్చిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు, సగం కాలి ఉన్న దుప్పి చర్మం

రాజవొమ్మంగి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో కొందరు దుప్పిని చంపి మాంసాన్ని ఇంటిలో భద్రపరచుకున్న విషయాన్ని శనివారం అధికారులు వెలుగులోకి తెచ్చా రు. కింద్ర పంచాయతీ ముంజవరప్పాడు గ్రామంలో కొందరు దుప్పిని చంపారనే సమాచారంతో రాజవొమ్మంగి ఎస్ఐ నరసింహమూర్తి, అటవీశాఖ ఎఫ్ఎస్వో రాము, ఎఫ్‌బీవో ఆనంద్‌లు గ్రామంలో పర్యటించగా ఓ ఇంటిలో వేటమాంసాన్ని అధికారులు గుర్తించారు. గ్రామస్థుల సమాచారంతో గ్రామశివారు జీడితోటలో దుప్పిని చంపిన ఆనవాళ్లను కాల్చిన ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. సగం కాలి ఉన్న దుప్పి చర్మాన్ని అధికారులు ఆ ప్రాంతంలో గుర్తించారు. కొందరు అనుమానితులను అటవీశాఖ అధికారులు శనివారం రాత్రి రాజవొమ్మంగి అటవీశాఖ కార్యాలయానికి తీసుకువచ్చి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు మద్దతుగా
రోడ్డుపైనే వంటావార్పు



రోడ్డుపైనే వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సీఐటీయూ

రంపచోడవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకులాల్లోని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు మద్దతుగా సీఐటీయూ రంపచోడవరం మెయిన్‌రోడ్డులో శనివారం వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించింది. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా మార్చి 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రంపచోడవరం ఐటీడీఏ ఎదురుగా జరుగుతున్న ఈ ఆందోళనలో భాగంగా నాల్గవ రోజు రోడ్డుపైన బైటాయించి వంటావార్పు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, నాయకులు కె.శాంతిరాజు పాల్గొన్నారు.

రంపలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

రంపచోడవరం, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలోని లూథరన్ చర్చి ప్రాంగణంలో నిర్వహించిన గ్రాండ్ ఐక్య క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే మిరియాల శిరిషదేవి, విజయభాస్కర్ దంపతులు పాల్గొన్నారు. శుక్రవారంరాత్రి బైబిల్ ప్రొఫెసర్ రెవరెండ్ డా.కొడాలి విజయ్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ఏజెన్సీ న లుమూలల నుంచి పెద్దఎత్తున క్రైస్తవులు హాజరయ్యారు. వేడుకల లో భాగంగా ఎమ్మెల్యే దంపతులు పలు ప్రాంతాలకు చెందిన వారిని సత్క రించారు.. ఎమ్మెల్యే దంపతుల ను సత్కరించారు.

40 కిలోల గంజాయి స్వాధీనం

మోతుగూడెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒడిసా రాష్ట్రం నుంచి కారులో అక్రమంగా 40కేజీల గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని డొంకరాయి పోలీసులు శనివారం అరెస్టు చేశారు. తమిళనాడుకు చెందిన ప్రకాష్‌జ్యోతిపాస్, రాజమహేంద్రవరానికి చెందిన చల్ల రవీంద్ర ఇద్దరూ కలిసి గంజాయిని హుండాయ్ కారులో తరలిస్తున్నారు. డొంకరాయి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా డొంకరాయి ఎస్ఐ శివకుమార్, తన సిబ్బందితో పట్టుకున్నారు. నిందితులు ఇద్దరినీ రామవరం ఎంపీడీవో రవికిషోర్ సమక్షంలో అరెస్టు చేశారు. చింతూరు ఇన్‌చార్జ్ సీఐ, ఎటపాక సీఐ కేసు దర్యాప్తు చేసి ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

పీసా కమిటీ ఉపాధ్యక్షుడిగా రామారావు

దేవీపట్నం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంటూరు సర్పంచ్ తీకల నాగరత్నం, సెక్రటరీ తేజ అధ్యక్షతన శనివారం పీసా గ్రామసభ ఎన్నికలు నిర్వహించారు. పీసా కమిటీ ఉపాధ్యక్షుడిగా జీడి రామారావుదొర, కార్యదర్శిగా కారం సోమరాజుదొరను ఎన్నుకున్నారు. అనంతరం వీరికి నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు తెల్లం శేఖర్, కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు, మడి అప్పన్నదొర, కారం రాజన్నదొర, వెల్ఫేర్ అసిస్టెంట్ జయాంజలి, డీఏ రమేష్ పాల్గొన్నారు.

మన్యంలో రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



గిరిజన మహిళలకు చీరలను పంచుతున్న రామకృష్ణా మఠం స్వామీజీ

రంపచోడవరం, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): మన్యంలో శారదాదేవీ మాత 175వ జయంతి నేపథ్యంలో రాజమండ్రి రామకృష్ణా మఠం ఆధ్వర్యంలో మన్యంలో పలు సేవా కార్యక్రమాలను లోతట్టు గ్రామాల్లో నిర్వహించారు. మారేడుమిల్లి మండలంలోని పలు గ్రామాల్లో రాజమండ్రి మఠం కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ ఆయా గ్రామాల్లో పర్యటించి గిరిజన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిషన్ మేనేజర్ స్వామి రఘువీరానందజీ మహారాజ్, స్వామి ప్రజ్ఞనాధనందజీ మహరాజ్, బి.ఆర్.ఎస్.శ్రీకాంత్, కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ట్రైకార్ రుణాలు

చింతూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ట్రైకార్ (ఎస్టీ కార్పొరేషన్) రుణాలు అందజేయడమే లక్ష్యమని ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం చింతూరు ఐటీడీఏ సమావేశ మందిరంలో ఎస్టీ కార్పొరేషన్ ద్వారా అందుతున్న రుణ సదుపాయాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీనివాసులు గిరిజన యువతను ఆర్థికంగా అభివృద్ధి చేసే దిశగా చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. ట్రైకార్ డైరెక్టర్లు కె.కృష్ణారావు, పి.లావణ్య, టి.అనురాధ పాల్గొన్నారు. చివరిగా ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసులను టీడీపీ, బీజేపీ నాయకులు, జేకే సీటీ సభ్యులు సత్కరించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



పంపా జలాశయాల చైర్మన్‌ను అభినందిస్తున్న యనమల రామకృష్ణుడు



సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్‌గా ఇళ్ల అప్పారావుకు ధ్రువపత్రం అందజేస్తున్న ఇరిగేషన్ డీఈ రాజేంద్రప్రసాద్

రైతు సంక్షేమమే పరమావధిగా పనిచేయాలి

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు



తోట వెంకటాచలం పుష్కరప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా ధ్రువీకరణపత్రాలు అందుకుంటున్న అడబాల , తాండవ రిజర్వాయర్ ప్రాజెక్టు చైర్మన్, వైస్‌చైర్మన్‌గా ఎన్నికైన కరక సత్యనారాయణ, మేరపురెడ్డి జోగిబాబులు

తునిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే పరమావధిగా పనిచేయాలని సీనియర్‌నేత టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తాగునీటి ఎన్నికల్లో పంప జలాశయ చైర్మన్‌గా ఎన్నికైన బైరావజ్ఝుల రామచంద్రమూర్తి ఆ ప్రాంతం రైతులతో కలిసి తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో యనమలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని, రైతాంగాన్ని లాభసాటి చేసే దిశగా ఎమ్మెల్యే దివ్య పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కోడా వెంకటరమణ, కొయ్యా సూరిబాబు, కొయ్యా కేశవ్, పరవాడ తాతబాబు, వైస్ చైర్మన్ నామాల సుభద్రరావు, ఆరుగెల నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్‌గా ఇళ్ల అప్పారావు ఎన్నిక

ప్రత్తిపాడు: మండలంలోని ఈ.గోకవరం గ్రామంవద్ద గల మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్‌గా ఇళ్ల అప్పారావు ఎన్నికయ్యారు. శనివారం చైర్మన్ అభ్యర్థిగా ఇళ్ల అప్పారావు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కూటమి నాయకులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం చైర్మన్‌గా ఇళ్ల అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా నీరుపారుదలశాఖ డీఈఈ రాజేంద్రప్రసాద్ ధ్రువీకరణ పత్రం అందజేశారు. వైస్‌చైర్మన్‌గా బొల్లు సోమన్నదొర ఎన్నికయ్యారు. దీంతో చైర్మన్ అప్పారావు, వైస్ చైర్మన్ సోమన్న దొరలతోపాటు సాగర్ సాగునీటి సంఘాల అధ్యక్షులను ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమాల్లో సాగర్ సాగునీటి సంఘాల అధ్యక్షుడు దిడ్డి సుబ్బారావు, సారిపల్లి లోకేష్, దళే నూకరాజు, చలంకూరి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ళ జగదీష్, అమరాది వెంకట్రావు, వై. గోవిందనాయుడు,సర్పంచ్‌లు మంతెన శ్రీను, తటవర్తి సుబ్బారావు, ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి, గంటుమళ్ళ రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇతంశెట్టి సూర్యభాస్కరబాబు, పర్వత సురేష్, వెన్నశివ, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పుష్కర ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా భాస్కరరావు

జగ్గంపేట: తోట వెంకటాచలం పుష్కరప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఎస్ఈ బి.ఏసుబాబు, ఈఈ ఎస్ పి.రాజేశ్వరరావు, పోలవరం డివిజన్ టు అధికారులు ఎన్నికలు నిర్వహించారు. ఎత్తిపోతల పథకం అధ్యక్షుడిగా జగ్గంపేటకు చెందిన అడబాల భాస్కరరావు, చైర్మన్ పెద్దాపురం అధ్యక్షుడు పాలకుర్తి లక్ష్మీపతిరావు, ప్రత్తిపాడు అధ్యక్షుడిగా కాకి లేటి వీర్రాజు(బాబ్జి), తుని చైర్మన్‌గా కుర్ర వెంకటరమణ ఎన్నికల్లో పాల్గొని తోట వెంకటాచలం పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా అడబాల భాస్కరరావును, వైస్‌చైర్మన్‌గా కుర్ర వెంకటరమణను ఎన్నుకున్నారు. వీరందరికీ ఎలక్షన్ ఆఫీసర్ నియామక పత్రాలు అందించారు. ఈ ఎన్నికలకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై విజయం సాధించిన చైర్మన్, వైస్‌చైర్మన్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, కోర్పు సాయితేజ, పరిమి బాబు, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, జీను మణిబాబు, కందుల బాబ్జి, అడబాల ఆంజనేయులు, యర్రంశెట్టి బాబ్జి, బుర్రి సత్తిబాబు, ముసిరెడ్డి నాగేశ్వరరావు, కాకిలేటి రాయుడు, సర్వసిద్ధి లక్ష్మణరావు, చల్లా రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తాండవ రిజర్వాయర్ చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఏకగ్రీవం

కోటనందూరు: తాండవ రిజర్వాయర్ ప్రాజెక్టు ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని ఎన్నికల అధికారి ఎ.ప్రేమస్వరూపారాణి తెలిపారు. తాండవ ప్రాజెక్టు పరిధిలో ఐదు డీసీలు ఉండగా అందులో చైర్మన్, వైస్‌చైర్మన్‌లను ఎన్నుకోవాల్సి ఉంది. చైర్మన్‌గా కరక సత్యనారాయణ, వైస్ చైర్మన్‌గా మేరపురెడ్డి జోగిబాబులు నామినేషన్‌లు వేశారు. దీంతో ఎవరు నామినేషన్‌లు వేయకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. వీరు ఎంపికపట్ల కాకినాడ, అనకాపల్లి జిల్లా టీడీపీ నేతలు మండల పార్టీ అధ్యక్షుడు గాడి రాజుబాబు, అంకంరెడ్డి రమేష్, షేక్ నవాబ్‌జానీ, డిచిరీంజీవిరాజు, పెనుముచ్చు నాగేశ్వరరావు, అచ్చుతరామరాజు,పోతల సూరిబాబు, చిటికెల సత్యనారాయణ, వెలగా వెంకట కృష్ణారావు, చింతకాయల రవికుమార్, లగుడు సత్యనారాయణమూర్తి, అంకంరెడ్డి బుల్లిబాబు ,వాసంనాగేశ్వరరావు, యర్ర చినసత్యనారాయణ, మాతిరెడ్డి బాస్కర్ రావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పంపానీటి సంఘం చైర్మన్‌గా బైరావర్జుల

అన్నవరం: పంపా నీటి సంఘం చైర్మన్‌గా బైరావర్జుల శ్రీరామచంద్రమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఉదయం ఇరిగేషన్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నికల అధికారిగా ఇరిగేషన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ శేషగిరి వ్యవహరించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైస్‌చైర్మన్‌గా నామాల సుభద్రరావు, అధ్యక్షుడిగా నాగం గంగబాబు, జువ్వల దండియ్య, నామాల నాగేశ్వరరావు, సోము చక్రంలు వ్యవహరించనున్నట్లు శేషగిరి తెలిపారు. కార్యక్రమంలో తుని నియోజకవర్గ నాయకులు యనమల రాజేష్, వెంకటేష్, అబ్బాయి పాల్గొని కార్యవర్గాన్ని అభినందించారు. ఇరిగేషన్ జె.ఈ సురేష్, అసిస్టెంట్ ఏఈ శ్రీదేవి పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 84 ఆవులు పట్టివేత

రౌతులపూడి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మూడు వాహనాల్లో తరలిస్తున్న 84 ఆవులను లచ్చిరెడ్డిపాలెం గ్రామంలో బీజేపీ జిల్లా యువ అధ్యక్షుడు చిత్రపాపారావు ఎస్. అగ్రహారం గ్రామశివారున అడ్డుకున్నాడు. వీటిని రౌతులపూడి పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పగా ఎస్ఐ వెంకటేశ్వరరావు వాహనాలను, తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఆవులను విశాఖజిల్లా ఏజెన్సీ చింతపల్లి నుంచి హైదారాబాద్‌కు తరలిస్తున్న సమయంలో పట్టుకున్నారు. రౌతులపూడి మండలం జనార్థనపట్నం గ్రామం మీదుగా మూడు వాహనాల్లో ఆవులను తరలిస్తుండగా ఆ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త మేడపై నుంచి చూడగా వాహనాల్లో ఆవులు కన్పించడంతో లచ్చిరెడ్డిపాలెంలో బీజేపీ జిల్లా యువ అధ్యక్షుడు చిట్రా పాపారావుకు సమాచారం ఇవ్వడంతో ఆవులు రవాణాను అడ్డుకుని పోలీసులకు అప్పగించాడు. 84 ఆవుల విలువ పది లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

వైద్య కళాశాలకు దేహదానం



వెంకట సీతారామలక్ష్మి(ఫైల్)

ప్రత్తిపాడు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో నివాసం ఉంటున్న యర్రవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.రామరాజు వర్మ తల్లి వెంకట సీతారామలక్ష్మి(78)శనివారం మృతి చెందారు. దీంతో ఆమె మృతదేహాన్ని రంగరాయ మెడికల్ కళాశాలకు వైద్యవిద్యార్థుల అధ్యయనం కోసం దానం గాఇచ్చారు. మృతురాలి కళ్ళను బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు అందజేశారు. సీతారామలక్ష్మి కోరిక మేరకే దేహదానం, నేత్రదానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు : తహసీల్దార్



కిరాణ దుకాణ యజమానులకు సూచనలిస్తున్న తహసీల్దార్ చిరంజీవి

చింతూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కిరాణా దుకాణాల్లో నిత్యావసర వస్తువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని చింతూరు తహసీల్దార్ చిరంజీవి హెచ్చరిం చారు. శనివారం దుకాణ యాజమాన్యంతో తహసీల్దార్ చిరంజీవి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పలు సూచనలు చేశారు. కిరాణ దుకాణాల్లో నిత్యావసర వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. నాణ్యత కలిగిన వస్తువులనే విక్రయించాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొన్ని చికెన్ దుఖాణాల్లో మృతి చెందిన కోళ్ళను విక్రయిస్తున్న విషయం కూడా తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇదే తీరు కొనసాగితే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

250 మంది పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ

ప్రత్తిపాడు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో శనివారం ఎంఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు అధినేత ముదునూరి మురళీకృష్ణంరాజు 250మంది పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కష్టాల్లో ఉన్న నిరుపేదలను ఆదుకోవడం, తమ చారిటబుల్ ట్రస్టు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొల్లు చిట్టిబాబు, ఎంపీటీసీలు జువ్వల సుజాత బాబులు, నానిపల్లి సత్యవతి చంటి,మాజీ ఎంపీటీసీ కోలా తాతబాబు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలను పాటించాలి: సీఐ

ప్రత్తిపాడు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నూతనంగా అమల్లోకి వచ్చిన ట్రాఫిక్ నియమ నిబంధనలు వాహనదారులు పాటించాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు కోరారు. స్థానిక చెక్‌పోస్టు సెంటర్‌లో శనివారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మోటార్ సైకిల్‌పై వెళ్లే ప్రయాణికులకు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. హెల్మెట్ ధరించకపోవడంవల్ల కలిగే నష్టాలు వివరించారు. శనివారం నుంచిహెల్మెట్‌ధారణ తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఐ లక్ష్మీకాంతం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలి

ఏలేశ్వరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి):జనవరి 5న విజయవాడలో జరిగే బహిరంగ సభకు తరలి రావాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు సమావేశం నిర్వహించారు. శనివారం జె.అన్నవరంలో సనాతన ధర్మ పరిరక్షణ కోసం , హైందవ దేవాలయాల స్వయం ప్రతిపత్తిని కల్పించాలని కోరుతూ విజయవాడ వేదికగా జనవరి 5న జరిగే సభకు హిందూ బంధువులు అధిక సంఖ్యలో తరలిరావాలని రామ్ కుమార్ పిలుపునిచ్చారు.

లాంగ్ జంప్ కోర్టు ప్రారంభం

కోటనందూరు, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): కోటనందూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ఆట స్థలంలో నేను సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన లాంగ్‌జంప్ కోర్టును జనసేన నాయకుడు అంకంరెడ్డి రాజశేషు ఆధ్వర్యం లో ప్రారంభించారు. హైస్కూల్ ఆట స్థలంలో సరియైన సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో లాంగ్ జంప్ కోర్టును నిర్మించామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగభూషణం, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ సాహిత్య అవార్డు గ్రహీత శ్రీనివాస్‌కు సత్కారం

రౌతులపూడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి గ్రామానికి చెందిన జాతీయ సాహిత్య అవార్డు గ్రహీత ఓం ఫౌండేషన్ ఆర్గనైజర్ సుర్ల శ్రీనివాస్‌ను కత్తిపూడి సాయి ప్రియా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్ సత్కరించారు. శ్రీనివాస్ సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో ఎం.కృష్ణ, సర్పంచ్ మాదాసు దొంగబాబు, ఎంపీటీసీ గాది రాజుబాబు, రాసంశెట్టి అర్జున్, కోరుప్రోలు రమేష్, కోరుప్రోలు సత్తిబాబు, ఎస్. లచ్చబాబు పాల్గొన్నారు.

తునిలో సెంట్రల్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం

తునిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తునిలో సెంట్రల్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం తుని బ్రాంచ్ నిర్వాహకులు అట్టహాసంగా నిర్వహించారు. 114వ వార్షికోత్సవ సందర్భంగా తునిలో ఎస్ఏ రోడ్డులో గల సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో బ్రాంచ్ మేనేజర్ దేవి ఆధ్వ ర్యంలో వ్యవస్థాపకుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మేనేజర్ దేవి మాట్లాడుతూ తమ శాఖ ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటుగా సమాజంలో మేము సైతం అంటూ కొన్ని సేవా కార్యక్రమాలు చేపడుతున్న విషయం గుర్తు చేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్



లారీ ఎక్కిన మతి స్థిమితం లేని వ్యక్తిని కిందకు దింపుతున్న దృశ్యం

చింతూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి చర్యలకు ప్రజలు భయపడుతున్నారు. గత రెండు రోజులుగా చింతూరు, చట్టిలలో మతిస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తి హల్‌చల్ చేస్తున్నాడు. అటుగా రాకపోకలు సాగించే వారిపై రాళ్లు విసరడం, ఆగి ఉన్న లారీ, ఆటోలలో ఎక్కడం లాంటి చర్యలకు వాహన చోదకులు కూడా భయపడుతున్నారు.

సీఎం సహాయ నిధి సాయం అందజేత

రంపచోడవరం, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): పలు ప్రమాద బాధితులకు అండగా నిలిచే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి అందిన ఆర్థిక సాయాన్ని శనివారం రంపచోడవరంలో తెలుగుదేశం నాయకులు ఆయా బాధితులకు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే శిరీష కార్యాలయంలో ఈ సాయాన్ని అందజేశారు. ఎటపాకలోని కె.నాగేంద్రబాబుకు రూ.93,934లు, టి.పివీడులోని చంద్ర పుల్లమ్మకు రూ.1లక్షా 25 వేలు, తోటపల్లికి చెందిన వై.జయమ్మకు రూ.1,52,806లు చెక్కుల రూపంలో అందజేశారు. నాయకులు వై.నిరంజనీదేవి, పెంటపాటి మోహన్, కిలారీ వెంకటేశ్వరరావు, చలపతిరావు, గణజాల తాతారావు, వాసంశెట్టి గంగాధర్‌పాల్గొన్నారు.

పుష్కర కాలువ మరమ్మతులకు రూ.60 లక్షలు మంజూరు

● ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య

తుని రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో తుని నియోజకవర్గంలో అస్తవ్యస్థంగా మారిన సాగునీటి కాలువ దుస్థితిపై అసెంబ్లీలో తుని ప్రాంత రైతులు గోడు వినిపించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ మేరకు ప్రభుత్వం సానుకూలతతో నీటిపారుదలశాఖ మంత్రి రూ.60లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే దివ్య తెలిపారు. త్వరితగతిన టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ నిధులతో సాగునీటి కాలువలు పూర్తయితే తుని ప్రాంత రైతులు వ్యవసాయం లాభదాయకం అవుతుందన్నారు.

చెడు వ్యసనాలతోనే దొంగతనాలు

● నగల దుకాణంలో దోపిడీ వివరాలు వెల్లడించిన డీఎస్పీ

అన్నవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో సంచలనం కలిగించిన పట్టపగలు నగలు దుకాణంలో ఇద్దరు దుండగులు నగలు దోపిడీకి కారణమైన ఇద్దరు నిందితులు ఉద్దగిరి అఖిల్, మామిడి రాజులను పోలీసులు అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. తాగుడు జూదం, బెట్టింగ్‌లకు బానిసలై అప్పులు చేసి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనలతో ఈ దోపిడీలకు పాల్పడినట్లు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పేర్కొన్నారు. శనివారం అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. వారంరోజులుగా నగల దుకాణంపై రెక్కీ నిర్వహించి అవసరమైన మారణాయుధాలను ముందుగా కొనుగోలు చేశారని నంబరు ప్లేట్‌లేని వాహనంపై సుత్తి, బ్లేడు, చాకు, కారప్పొడి, తాడు పట్టుకుని వచ్చారని తెలిపారు. నిందితులిద్దరిపై కేసు నమోదుచేసి పెద్దాపురం మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ దర్యాప్తులో ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు, అన్నవరం ఎస్.ఐ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన

ఏలేశ్వరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి):చిన్నింపేటలో జీడిపిక్కల పరిశ్రమలో పనిచేసే కార్మికులు శనివారం ఆందోళన కొనసాగించారు. పరిశ్రమ మూసివేయడాన్ని నిరసిస్తూ వారు గత కొద్ది రోజులుగా ఫ్యాక్టరీ గేటు వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యాజమాన్యం దిగివచ్చి 409 మంది కార్మికులకు న్యాయం చేసే వరకు ఆందోళన చేస్తామన్నారు. ఉపాధి కోల్పోయిన కార్మికులను దృష్టిలో పెట్టుకొని అధికారులు యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

విమానాశ్రయం వద్దంటూ రెవెన్యూ సదస్సులో రైతుల వినతి

తొండంగి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ భూముల్లో ప్రతిపాదించిన విమానాశ్రయ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని కోరుతూ బెండపూడి తదితర గ్రామాలకు చెందిన సుమారు రెండువందల మంది రైతులు రెవెన్యూ సదస్సులో అధికార్లకు వినతి పత్రం అందించారు. శనివారం బెండపూడిలో తహశీల్దార్ మురార్జీ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. దీనికి హాజరైన బెండపూడి, పిఇ చిన్నయ్యపాలెం, అన్నవరం గ్రామాలకు చెందిన రైతులు పచ్చని పంటతో మూడు పంటలు పండే తమ భూములను ఎట్టి పరిస్థితుల్లోను విమానాశ్రయానికి ఇవ్వబోమన్నారు. తమ నిర్ణయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని తహశీల్దార్‌కు విన్నవించారు. తమకు న్యాయం జరిగేందుకు సహకరించాలని కోరారు. సదస్సులో మొత్తం 50దరఖాస్తులు అందాయి. ఆర్ఐ రాజారావు, బెండపూడి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సాధనాల నూకరాజు, పాలచర్ల యర్రబ్బు, గోపి, బూసాల శ్రీనివాసరావు, జనసేన నేత బెండపూడి నాయుడు, రైతు కమిటీ సభ్యులు రాయవరపు ఆనంద్, బొడ్డు శ్రీకాంత్, నాగేశ్వర్రావు ఉన్నారు.

ప్రపంచ ధ్యాన దినోత్సవం

జగ్గంపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రపంచ ధ్యాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, సీహెచ్ శివరామకృష్ణప్రసాద్, శ్రీరామచంద్రమిషన్ హార్ట్ పేల్నెస్, ధ్యాన మందిరం సభ్యులు విచ్చేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ రోజూ ధాన్యంవల్ల కలిగే ప్రయోజనాలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కో ఆర్డినేటర్ పి.విశ్వేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ బాలరాజు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.